## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 04-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హోలీ రంగుల పండుగను దేశ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఉత్సాహభరితంగా జరుపుకున్నారు.
- ❖ ఇరాన్ పై ఇజ్రాయెల్ ఈరోజు జరిపిన తాజా దాడుల్లో వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.
- ❖ గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న ప్రయాణికుల కోసం భారత ప్రభుత్వం 58 విమానాలను నడుపుతోంది.
- ❖ న్యూఢిల్లీ వేదికగా రేపు జరిగే 11వ “రైసినా డైలాగ్”లో పాల్గొనేందుకు ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్ చేరుకున్నారు.
- ❖ కోల్ కతా వేదికగా న్యూజిలాండ్ తో జరుగుతున్న మొదటి సెమీఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా తొలుత బ్యాటింగ్ చేస్తోంది.

========================

హోలీ రంగుల పండుగను దేశ ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఈరోజు ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచించే ఈ పండుగను వసంత రుతువు ప్రారంభానికి గుర్తుగా భావిస్తారు. మధ్యప్రదేశ్‌లో హోలీని సాంప్రదాయ జానపద పాటలు, ఉత్సాహభరితమైన రంగుల ఆటలతో అత్యద్భుతంగా జరుపుకున్నారు. ఉజ్జయినిలో శిప్రా నది ఒడ్డున భక్తులు హోలీని జరుపుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని గిరిజన సమూహాలు హోలీ పండుగను విభిన్న శైలిలో జరుపుకోగా భాగోరియా, ఝబువా, అలీరాజ్‌పూర్, ధార్ వంటి ప్రాంతాలలో గిరిజనుల సాంప్రదాయ సంగీతం, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలోని చారిత్రాత్మక రిడ్జ్ మైదానంలో స్థానిక నివాసితులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమిగూడి రంగుల పండుగను జరుపుకున్నారు. ఈ రంగుల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లోకి ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని తీసుకురావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ రెండు రోజుల భారత పర్యటన నిమిత్తం ఈ ఉదయం న్యూఢిల్లీ చేరుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆయనకు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. రేపు ప్రారంభమయ్యే `రైసినా డైలాగ్ 2026`లో అలెగ్జాండర్ స్టబ్ ముఖ్య అతిథిగా పాల్గొనున్నారు. తన పర్యటన భారత్, ఫిన్లాండ్ దేశాల మధ్య వాణిజ్యంతో సహా ఇతర రంగాలలో సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అలెగ్జాండర్ సామాజిక మాధ్యమం పోస్టులో పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడి పర్యటన భారత్ - ఫిన్ లాండ్ సంబంధాలను నూతన శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. రేపు జరగబోయే "రైసినా డైలాగ్" లో అలెగ్జాండర్ స్టబ్ చేయబోయే ప్రసంగం కోసం తాను ఎదురుచూస్తున్నట్లు నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం పోస్ట్ లో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇరాన్ పై ఇజ్రాయెల్ ఈరోజు జరిపిన తాజా దాడుల్లో వెయ్యి మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. టెహ్రాన్‌లోని బాసిజ్ మిలీషియా, అంతర్గత భద్రతా కమాండ్ సెంటర్‌లపై ఇజ్రాయెల్ వరుస దాడులు చేయడంతో పశ్చిమాసియాలో సంఘర్షణ మరింత తీవ్రమైంది. బీరుట్‌లోని హిజ్బుల్లా మౌలిక సదుపాయాలపై కూడా దాడి చేసినట్లు ఇజ్రాయెల్ వైమానిక దళం IDF వెల్లడించింది. ఫిబ్రవరి 28 నుండి ప్రారంభమైన ఈ దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటివరకూ 1,097 మంది పౌరులు మరణించినట్లు అమెరికాకు చెందిన మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దళాలు, ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణల్లో సైప్రస్ దాడికి గురైంది. దీంతో బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు సైప్రస్‌లో యుద్ధనౌకలను మోహరిస్తున్నాయి. సైప్రస్ లో ఉన్న బ్రిటిష్ సైనిక సిబ్బంది భద్రతకు తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆ దేశ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా ఫ్రాన్స్ విమాన వాహక నౌక చార్లెస్ డి గల్లెను మధ్యధారా సముద్రానికి తరలించాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక "IRIS దేనా" పై అమెరికా దాడి చేసింది. "ఐఆర్ఐఎస్ దేనా"ను తామే ముంచేశామని అమెరికా ప్రకటించింది. హిందూ మహాసముద్రంలో ఆ నౌకపై జలాంతర్గామి టార్పిడోలతో దాడి చేసినట్లు అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ధృవీకరించారు. మునిగిపోతున్న యుద్ధనౌక నుంచి 32 మందిని రక్షించి.. ఆసుపత్రిలో చేర్చినట్లు శ్రీలంక నేవీ ప్రకటించింది. ఆ నౌకలో మొత్తం 180 మంది ఉన్నట్లు సమాచారం ఉందని, ఘటనా స్థలంలో అనేక మృతదేహాలు లభ్యమయ్యాయని శ్రీలంక నౌకాదళ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో గల్ఫ్ దేశాలలో చిక్కుకున్న ప్రయాణికుల కోసం 58 విమానాలను నడుపుతున్నట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో ఇండిగోకు చెందిన 30 విమానాలు, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లకు చెందిన 23 విమానాలున్నాయి. నిషేధిత గగనతలాన్ని నివారించేలా.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విమాన సేవలను పునరుద్ధరిస్తున్నట్లు, ఇందుకోసం షెడ్యూల్లో తగిన మార్పులు చేసినట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. కాగా ఇప్పటివరకు భారత విమానయాన సంస్థలకు చెందిన 1,200 లకు పైగా విమానాలు, విదేశీ సంస్థలకు చెందిన దాదాపు 380 విమానాలు ఈ ఘర్షణల కారణంగా రద్దయినట్లు ఆ శాఖ వెల్లడించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ కంట్రోల్ రూమ్ ను ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు 1800 11 8797 (టోల్ ఫ్రీ) నంబర్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొంది. అదే విధంగా సంఘర్షణ ప్రాంతంలోని భారత రాయబార కార్యాలయాలు భద్రతా చర్యలు, సురక్షిత ప్రదేశాలకు తరలింపు ప్రక్రియలను సమన్వయం చేయడంలో సహాయపడటానికి 24/7 అత్యవసర హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశాయని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీ వేదికగా రేపు జరిగే 11వ రైసినా డైలాగ్ లో పాల్గొనడానికి భూటాన్ విదేశాంగ మంత్రి దినా నాథ్ ధుంగేల్, మాల్టా విదేశాంగ మంత్రి ఇయాన్ బోర్గ్ ఈరోజు భారత్ చేరుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వీరికి స్వాగతం పలుకుతూ... భారతదేశం భూటాన్ మధ్య భాగస్వామ్యం లోతైన పరస్పర విశ్వాసం, సద్భావనపై నిర్మించబడిందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో చేసిన ఒక పోస్ట్ లో పేర్కొన్నారు. ఇక భారత్ - మాల్టా దేశాల మధ్య బలమైన ప్రజా సంబంధాలున్నాయని రణధీర్ జైస్వాల్ గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు విదేశాంగ ప్రాధాన్యతలైన నైబర్‌హుడ్ ఫస్ట్, యాక్ట్ ఈస్ట్, మహాసాగర్, ఇండో-పసిఫిక్‌తో సహా మూడు కీలక విధానాల సమ్మేళనంలో మయన్మార్ భాగంగా ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. న్యూ ఢిల్లీలోని సర్వోటెక్‌మాన్ లిటరరీ సెంటర్ భవనం ప్రారంభోత్సవానికి ఈరోజు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ... ఈ భవనం భారత్, మయన్మార్ సన్నిహిత ద్వైపాక్షిక సంబంధాలకు చిహ్నమని కొనియాడారు. సర్వోటెక్‌మాన్ సెంటర్ మయన్మార్ దేశపు శాస్త్రీయ జానపద సాహిత్యాల పరిరక్షణకు మద్దతునిస్తుందని జైశంకర్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య కోలకతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతోంది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫికా ఆరంభంలోనే కీలక వికెట్లను కోల్పోయింది. కానీ 6వ వికెట్‌కు  మార్కో యాన్సెన్, క్రిస్టన్స్ స్టబ్స్ 72 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో 18 ఓవర్లు పూర్తయ్యే సరికి 6 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. ఇక రేపు ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలలో రాబోయే ఐదు రోజుల పాటూ తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. గుజరాత్, కొంకణ్, గోవాలలో ఈ నెల 6 వరకు వేడి తేమతో కూడిన పరిస్థితులు ఉండవచ్చని పేర్కొంది. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని IMD శాస్త్రవేత్త శశికాంత్ మిశ్రా వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 238 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరకు 1,122 పాయింట్ల నష్టంతో 79 వేల 116 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 385 పాయింట్లు క్షీణించి 24 వేల 480 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 92 రూపాయల 18 పైసలుగా ఉంది.